సాక్షి సూర్యాపేట

బుధవారం ¦ 15 ¦ నవంబర్ ¦ 2023



ఓటరు చైతన్యానికి..
డబ్బు, మద్యం తీసుకోకుండా నిజాయితీగా ఓటు వేయాలని ఓ యువకుడు పోస్టర్లు ముద్రించి ప్రచారం చేస్తున్నాడు. - 10లో



ఓటుతో బుద్ధి చెప్పాలి
నియంతృత్వ పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని జాగో తెలంగాణ కన్వీనర్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. - 10లో



యాదాద్రిలో వ్రత పూజలు
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలు ప్రారంభమయ్యాయి. - 10లో

న్యూస్‌రీల్

రేపు హుజూర్‌నగర్‌కు కోదండరాం రాక

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో ఈనెల 16న తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, సుప్రీం కోర్టు అడ్వకేట్ నిరూప్‌రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ దామోదర్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈమేరకు టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొంతిరెడ్డి శ్రీనివాస రెడ్డి మంగళవారం తెలిపారు. సీఎం కేసీఆర్ పాలన, తెలంగాణ పరిస్థితిపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

పారదర్శకంగా రెండో విడత ర్యాండమైజేషన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల నేపథ్యంలో పీఓ, ఏపీఓల రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాల సాధారణ పరిశీలకుడు బాలకిషన్ ముండా, కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాల సాధారణ పరిశీలకుడు కౌశిగన్, పోలీస్ పరిశీలకుడు ఫర్హాత్ అబ్బాస్, ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకలతో కలసి పీఓ, ఏపీఓల రెండవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు నియోజకవర్గాల్లో పీఓ, ఓపీఓలకు ఎన్నికల నిర్వహణ, విధివిధానాలపై మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో గుర్తించిన 640 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌తో పాటు 210 కేంద్రాల్లో బయట కూడా వెబ్ క్యాస్టింగ్ చేపట్టనున్నట్లు వివరించారు.


విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

సూర్యాపేటటౌన్: విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యంతో చదవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి అన్నారు. మంగళవారం జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాలలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలన్నా, సమాజం, కుటుంబం పురోగతి సాధించాలన్నా, విద్యార్థులు మంచి లక్ష్య సాధనతో ఎదిగినప్పుడే సాధ్యమవుతుందని తెలిపారు. సమాజం సన్మార్గంలో నడిచినప్పుడు నేర ప్రవృత్తి తగ్గి మంచి వ్యవస్థ ఏర్పడుతుందని చెప్పారు. కాగా.. చిన్నారులు వివిధ వేషధారణల్లో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జె.శశిధర్, న్యాయవాదులు సత్యనారాయణ పిళ్లై, బొల్లెద్దు వెంకటరత్నం, ప్రవీణ్‌కుమార్, పెండెం వాణి, నరేందర్‌రెడ్డి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే వేటు తప్పదు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

హుజూర్‌నగర్: పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే వేటు తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉంటూ, పార్టీకి నష్టం చేస్తున్న జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రవి నాయక్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎస్.పాండు, ఎస్.వెంకటేశ్వర్లు, కె.గోపి, పల్లె వెంకటరెడ్డి, డి.బ్రహ్మం, వి.సైదులు, పాండు, యాకోబు, హుస్సేన్, రాంబాబు, శీలం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.





ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్, 24 గంటల కరెంట్ కావాలా వద్దా అని కేసీఆర్ ప్రశ్నించగా.. కావాలంటూ చేతులు ఎత్తిన బీఆర్ఎస్ శ్రేణులు

- నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని నేనే వచ్చి ప్రారంభిస్తా
- భగత్‌కు 70 వేల మెజార్టీ ఇవ్వాలి
- జానారెడ్డి హయాంలో నాలుగు రోడ్లు తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదు
- బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

అభివృద్ధికి భరోసా

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే.. కొత్త పథకాలతో పాటు పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం

జంగ్ తెలంగాణ

హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నోముల భగత్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారు. భగత్‌ను 70 వేల మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మంగళవారం హాలియా పట్టణంలోని దేవరకొండ రోడ్డు వెంట అనుముల వద్ద జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లలో చేసిన అభివృద్ధిని సీఎం వివరించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూనే.. మరో వైపు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేశారు. బీజేపీ ఊసెత్త లేదు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఏడు సార్లు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. జానారెడ్డి హయాంలో నాలుగు రోడ్లు తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని, సాగర్ ఉప ఎన్నికల్లో గెలిచిన నోముల భగత్ గడిచిన రెండేళ్లలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు.

నెల్లికల్లు లిఫ్ట్‌ను ప్రారంభిస్తాం..

సాగర్ నియోజకవర్గానికి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీ8, డీ8 లిఫ్ట్ పనులు పూర్తయ్యాయని, నెల్లికల్లు లిఫ్ట్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని సీఎం కేసీఆర్ చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగిలిన పనులు కూడా పూర్తి చేసి నెల్లికల్లు లిఫ్ట్ ప్రారంభోత్సవానికి స్వయంగా తానే వస్తానని హామీ ఇచ్చారు. నోముల భగత్ చెప్పిన పనులన్నీ పూర్తవుతాయని సీఎం పేర్కొన్నారు. ఈ సభలో బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కేశవరావు, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, మధుసూదనాచారి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, నాయకులు కడారి అంజయ్య యాదవ్, బాబురావు నాయక్, కర్ణ బ్రహ్మరెడ్డి, మార్కెట్ చైర్మన్లు మర్ల చంద్రారెడ్డి, జవ్వాజి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీలు అబ్బిడి కృష్ణారెడ్డి, సూర్యాభాష్యానాయక్, ఎంపీపీలు పేర్ల సుమతిపురుషోత్తం, బొల్లం జయమ్మ, ఆంగోతు భగవాన్ నాయక్, నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ అనూష తదితరులు పాల్గొన్నారు.



హాలియా పరిధిలోని అనుముల వద్ద నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభావేదికపై నాయకులు

బీఆర్ఎస్‌లో నూతనోత్సాహం

వేలాదిగా తరలివచ్చిన జనంతో సీఎం కేసీఆర్ బహిరంగ సభ గులాబీమయమైంది. ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ విజయవంతం కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనిపించింది. మధ్యాహ్నం 3గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో వచ్చేసరికి.. సభలో చాలామంది జనం రోడ్డుపై నిలవడం వల్ల సభలోని కుర్చీలు ఖాళీగా కనిపించాయి. రోడ్డుపై నిలిచి ఉన్న ప్రజలను సభలోకి రావాలని నోముల భగత్ పదేపదే పిలుపునివ్వడంతో జనం సభలోకి వచ్చారు. ఆ తరువాత సీఎం కేసీఆర్ సభావేదిక వద్దకు చేరుకోగానే ప్రజలు కేరింతలు కొట్టారు. సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో 24 గంటల విద్యుత్, ధరణి ఉండాలా..? వద్దా..? అంటూ ప్రజలను కోరగా.. ఉండాలి అని ప్రజలు నినాదాలు చేయడం కనిపించింది. రైతుబంధు వద్దా.. అన్నప్పుడు అందరూ కావాలంటూ చేతులు పైకెత్తి జై కేసీఆర్ అంటూ నినదించారు. బహిరంగసభలో సీఎం కేసీఆర్ 25 నిమిషాలు ప్రసంగించారు. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలోనే ప్రజలు క్రమంగా వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. కాగా, సీఎం పర్యటన సందర్భంగా పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తును ఎస్పీ అపూర్వరావు పర్యవేక్షించారు.

సాగర్ అభివృద్ధిని కొనసాగిస్తా..
– బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్

ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని సాగర్ బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ చెప్పారు. నెల్లికల్లు లిఫ్ట్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాగర్‌లో బీసీ గురుకుల డిగ్రీ కళాశాల ఏర్పాటైందని, కుంకుడుచెట్టు తండాలో డీ8, డీ9 కెనాల్ పూర్తి చేసినట్లు తెలిపారు. రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, మరో రూ.350 కోట్లు నియోజకవర్గ అభివృద్ధి నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. తిరుమలగిరి మండలానికి డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని, పులిచర్ల, కన్నెకల్‌ను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని, చెక్ డ్యాంలను నిర్మించాలని, కంపాసాగర్‌లో 285 ఎకరాల స్థలం ఉందని అందులో వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే ప్రజలు మరోసారి తనకు అవకాశం కల్పించి ఆశీర్వదించాలని కోరారు.



సీఎం కేసీఆర్ ఆశీస్సులు తీసుకుంటున్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల భగత్

అవినీతి బీఆర్ఎస్‌ను గద్దెదించాలి

- హుజూర్‌నగర్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రఘునాథపాలెంలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: రాష్ట్రంలో అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ఎంపీ, హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మఠంపల్లి మండలం మేజర్‌పంచాయతీ రఘునాథపాలెంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాఘం నరసింహారావు, వార్డుసభ్యులు నవీన్, కోటేశ్వరమ్మలతో పాటు 25 కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్ర అభివృద్ధిని కుంటుపడేసిందని ఆరోపించారు. గిరిజన తండాలకు ఆర్టీసీ బస్సులు నడపడం లేదని, 24 గంటల విద్యుత్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదని విమర్శించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టులు కట్టి కాలువలు తీసి సాగునీరందించామన్నారు. సాగునీరు సక్రమంగా అందని కిష్టపట్టి లాంటి టేలాండ్ ప్రాంతంలో తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా రూ.వేలాది కోట్లతో కృష్ణానదిపై ఎత్తిపోతల పథకాలు నిర్మించి సాగునీరందించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూక్యామంజీనాయక్, తిరుమలశెట్టి అప్పయ్య, డీవీ సుబ్బారావు, అల్లం ప్రభాకర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, ఎంపీటీసీ చెన్నయ్య, మాజీ ఎంపీటీసీ సామేలు, పుల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, నాగులుమీరా, జమీల్, నిజాం, అప్పారావు, ఎకీర్ అహ్మద్, నరసింహారావు, అచ్చయ్య, సామ్యేల్, లక్ష్మయ్య, జోజి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి
- ప్రశాంత ఎన్నికలకు కృషి చేయాలి
- అధికారుల సమీక్షా సమావేశంలో పోలీసు పరిశీలకుడు ఫర్హాత్ అబ్బాస్



మాట్లాడుతున్న పోలీసు పరిశీలకుడు ఫర్హాత్ అబ్బాస్, చిత్రంలో ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: ఎన్నికల విధుల నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసు పరిశీలకుడు, వెస్ట్‌బెంగాల్ క్యాడర్ డీఐజీ ఫర్హాత్ అబ్బాస్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీసు అధికారుల సమీక్షా సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లను, రక్షణ ప్రణాళికను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రానున్న 16 రోజులు చాలా ముఖ్యమైనవని, సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పని చేయాలన్నారు. ఏదైనా సమస్య వస్తే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గల గ్రామాల్లో నిఘా కట్టుదిట్టం చేయాలన్నారు. చెక్ పోస్టుల్లో వాహనాల తనిఖీలు చేస్తూనే ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాలను అడ్డుకోవాలని తెలిపారు. ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విధుల నిర్వహణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్య సృష్టించే ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి ఎన్నికల నియమావళి పట్ల అవగాహన కల్పించి మళ్లీ నేరాలకు పాల్పడకుండా ముందస్తు బైండోవర్ చేయాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేస్తామని ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. అధికారుల మధ్య సమాచార, సమన్వయ లోపం లేకుండా పని చేస్తామన్నారు. తనిఖీల్లో రూ.2 కోట్ల99లక్షలు, రూ.17లక్షల 29 వేల విలువగల 3,511 లీటర్ల మద్యం, సారా తయారీ బెల్లం, పట్టిక, రూ.1 కోటి 29 లక్షల విలువగల 283 గ్రాముల బంగారం, 140 కేజీల సిల్వర్, రూ. 1 కోటి 6 లక్షల విలువగల ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు, రూ.50 లక్షల విలువగల గంజాయి సీజ్ చేసినట్లు చెప్పారు. 143 లైసెన్స్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, రవి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


ఉచిత, నాణ్యమైన విద్యుత్‌తోనే సస్యశ్యామలం



చిట్యాలలో నిర్వహించిన రోడ్ షోకు హాజరైన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజలు

వరిసాగులో నల్లగొండ మొదటి స్థానంలో నిలిచింది

- ఫ్లోరిన్ నీటిని తాగించిన కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలి
- అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్న బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలి
- చిట్యాల రోడ్ షోలో మంత్రి కేటీఆర్



రోడ్ షోలో విజయసంకేతం చూపుతున్న మంత్రి కేటీఆర్, పక్కన అభ్యర్థి చిరుమర్తి లింగయ్య

చిట్యాల: రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్‌ను ఉచితంగా ఇవ్వడంతోనే నల్లగొండ జిల్లా సస్యశ్యామలంగా మారిందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నకిరేకల్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను గెలిపించాలని కోరుతూ మంగళవారం చిట్యాలలో నిర్వహించిన రోడ్ షోకు మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. జాతీయ రహదారి మీదుగా స్థానిక పాల కేంద్రం నుంచి ఎన్నికల ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ కనకదుర్గా సెంటర్ వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో నల్లగొండ జిల్లా ప్రజలకు ఫ్లోరిన్ నీళ్లు తాగించారని.. జిల్లా ప్రజలకు రోషం ఉంటే కాంగ్రెస్ పార్టీని బొందపెట్టి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలన్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ ఎగిరెగిరిపడుతున్నారు..

కర్ణాటకతో పాటు, కాంట్రాక్టు పనులతో వస్తున్న డబ్బుతో రాజకీయాలు చేస్తూ కోమటిరెడ్డి బ్రదర్స్ ఎగిరెగిరి పడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల్లో పోటీచేయకపోయినా తానే సీఎం అవుతానని జానారెడ్డి ప్రకటనలు చేస్తున్నారని, బీఆర్ఎస్‌ను ఓడించి గడ్డం తీసుకుంటానని ప్రతిజ్ఞ చేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం మరోసారి ఓడిపోవడం ఖాయమన్నారు. ఎమ్మెల్యేగా చిరుమర్తి లింగయ్యను గెలిపిస్తే చిట్యాల పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని, హైవేపై ఫ్లైఓవర్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లగొండ, యాదాద్రి జిల్లాల జెడ్పీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గొర్రెల మేకల పెంపకందారుల కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చాడ కిషన్‌రెడ్డి, చెరుకు సుధాకర్ గౌడ్, గుత్తా అమిత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, ఎంపీపీ కొలను సునీత, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పెద్దబోయిన సత్తయ్య, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, నాయకులు వనం వెంకటేశ్వర్లు, గుండెబోయిన సైదులు, పొన్నం లక్ష్మయ్య గౌడ్, కందాటి రమేష్‌రెడ్డి, చెరుకుపల్లి మహేష్, జనగాం నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి..

నకిరేకల్ నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో వందల కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని చిరుమర్తి లింగయ్య కోరారు. నియోజకవర్గ అభివృద్ధితోపాటు సామాన్యులు, వ్యాపారులపై దాడులను నిరోధించేందుకే బీఆర్ఎస్ పార్టీలో తాను చేరినట్లు చిరుమర్తి వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తున్నారని ఆయనను ఓడించి ఎక్కడి నుంచి వచ్చాడో అక్కడికే పంపించాలని పిలుపునిచ్చారు. పేదవాడినైన తన ఎదుగుదలపై అక్కసుతోనే కోమటిరెడ్డి బ్రదర్స్ కుట్రలు పడుతున్నారని ఆరోపించారు.

కాల్పులు ఆపండి.. బాలలను కాపాడండి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి, సభ్యులు

హుజూర్‌నగర్: ప్రత్యక్షంగా యుద్ధం చేస్తూ గాజాలోకి వెళ్లిన ఇజ్రాయెల్ సైన్యాన్ని వెంటనే వెనక్కి పిలిపించాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి కోరారు. సమాఖ్య జాతీయ సమితి పిలుపు మేరకు బాలల దినోత్సవం సందర్భంగా 'కాల్పులు ఆపండి - బాలలను కాపాడండి' అనే నినాదంతో మంగళవారం హుజూర్‌నగర్‌లోని జంగిడి సెంటర్‌లో ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హమాస్ ఉగ్రవాదులు చర్యకు ప్రతీకారంగా, గాజా పట్టణంపై రాకెట్ దాడులు చేసి వేల మంది మహిళలు, పిల్లలను చంపడం ఘోరమన్నారు. గాజాలోకి వెళ్లిన ఇజ్రాయెల్ సైన్యాన్ని వెంటనే వెనక్కి పిలిపించి, శాంతి నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు దేవరం అరుణ, పుల్లమ్మ, వీరమ్మ, లింగమ్మ, నర్సమ్మ, సోమమ్మ, లక్ష్మీ వెంకటమ్మ, లక్ష్మీకాంత, విజయ, మంగమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

● 'గులాబీ' జోరు



హాలియా ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి భగత్, వేదికపై కే. కేశవరావు, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎంసీ కోటిరెడ్డి



కేసీఆర్ సభలో యువకుడి జోష్



సభలో పాటలు పాడుతున్న ఏపూరి సోమన్న



ఎంపీ కేశవరావుతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, విజయేందర్‌రెడ్డి



సీఎం కేసీఆర్‌కు దట్టీ కడుతున్న ముస్లిం నాయకుడు



సీఎం సభకు వస్తూ హాలియా సమీపంలో పొలం గట్ల మధ్య కూర్చొని భోజనాలు చేస్తున్న మహిళలు

● 'షో' అదుర్స్



చిట్యాల రోడ్‌షోలో ప్రజలకు నమస్కరిస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి లింగయ్య తదితరులు



రోడ్‌షోలో నినాదాలు చేస్తున్న కేటీఆర్ తదితరులు



మంత్రి ప్రసంగాన్ని వింటున్న మహిళలు

ప్రజా ఆశీర్వాద సభ సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 2:54గంటలకు సభా వేదిక సమీపంలో సీఎం కేసీఆర్ హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది.
- 3:11 గంటలకు సభా వేదికపైకి సీఎం కేసీఆర్ చేరుకొని నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అభివాదం చేశారు.
- 3:14 గంటలకు సభా వేదికపై కేసీఆర్‌కు ముస్లిం నాయకుడు దట్టీ కట్టారు.
- 3:14 నుంచి 3:19గంటల వరకు నాగార్జునసాగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల భగత్ ప్రసంగించారు.
- అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ పాదాలకు ఎమ్మెల్యే నోముల భగత్ నమస్కరించారు.
- 3:21 గంటలకు కేసీఆర్ ప్రసంగం ప్రారంభించారు.
- ప్రసంగం 3:45గంటలకు ముగించారు.
- 3:39 గంటలకు తిరిగి హెలిప్యాడ్‌కు వద్దకు చేరుకున్నారు.
- సీఎం కేసీఆర్ 3:54 గంటలకు తిరిగి వెళ్లిపోయారు.

– తిరుమలగిరి(నాగార్జునసాగర్)

ఓటరు చైతన్యానికి పోరాటం

- డబ్బు, మద్యం పంపిణీ అడ్డుకోవడానికి యత్నం
- పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న నవీన్‌కుమార్

ఆత్మకూరు(ఎం): ఓటరులో చైతన్యం తీసుకొచ్చేందుకు ఓ యువకుడు నడుం బిగించాడు. డబ్బు, మద్యం తీసుకోకుండానే ఓటు వేయాలని ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నాడు. పోస్టర్లు ముద్రించి ప్రచారం చేస్తున్నాడు. అతనే యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన మెరుగు నవీన్‌కుమార్. గీత కార్మికుడు, సహజ కవి మెరుగు మల్లేశం–పద్మ దంపతుల కుమారుడు మెరుగు నవీన్‌కుమార్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి ప్రస్తుతం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని రెడ్డి ల్యాబ్‌లో పని చేస్తున్నాడు. ప్రతి ఎన్నికల్లో ధన ప్రభావం, మద్యం పంపిణీ విపరీతంగా జరుగుతుండంతో నిజమైన సేవా గుణం గల ప్రజా ప్రతినిధులు రావడం లేదని గుర్తించాడు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెరుగుతున్న అవినీతి, అభివృద్ధి పనుల్లో కనిపిస్తున్న అవినీతిని కట్టడి చేయాలనుకున్నాడు. ఎన్నికల్లో మద్యం, డబ్బు ముట్టకుండా ఓటు వేయాలంటే ఓటరులో చైతన్యం తేవాలనుకున్నాడు. దీంతో ×ఓటు–మాట¤ పేరుతో పోస్టర్‌లను అచ్చువేయించాడు. ఉమ్మడి జిల్లా అధికారుల చేతుల మీదుగా ఆ పోస్టర్‌ను ఆవిష్కరింజేశాడు. ఆ పోస్టర్‌లను ప్రభుత్వ కార్యాలయాల వద్ద, ముఖ్య కూడళ్ల వద్ద గోడలపై అంటిస్తూ ఓటరులో చైతన్యం నింపే ప్రయత్నం చేస్తున్నాడు.



గోడలపై పోస్టర్ అంటిస్తున్న నవీన్‌కుమార్

సేవా గుణం ఉన్న వారినే ఎన్నుకుంటారని..



ఓటరులో చైతన్యం తీసుకరావడం వల్ల నిజమైన సేవా గుణం ఉన్న నాయకుడినే ఎన్నుకుంటారని నా వంతుగా ప్రయత్నం చేస్తున్నా. మద్యం, డబ్బు పంపిణీతో దోచుకునే నాయకులే ప్రజా ప్రతినిధులుగా వస్తున్నారు. ఓటరు ఎప్పుడైతే నిస్వార్థంగా, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేస్తాడో అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం, నిజమైన అభివృద్ధి, నిజమైన సేవ మనకు కనిపిస్తుంది.

– మెరుగు నవీన్‌కుమార్

2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 'ఓటు వెయ్యి..అక్రమార్కుల తాటా తియ్యి' అంటూ పుస్తకం రూపంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ప్రచారం చేశాడు. వాల్ పోస్టర్ల ద్వారానే కాకుండా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నాడు.

జంగ్ తెలంగాణ

● గెలుపు గుర్రం



భువనగిరి మండలం వడాయిగూడెంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి అక్కడ ఉన్న జట్కా బండిపై సవారీ చేసి ఓట్లు అభ్యర్థించారు.

కేటీఆర్ రోడ్ షో హైలెట్స్

- మంత్రి కేటీఆర్ మధ్యాహ్నం 1.45గంటలకు చిట్యాలకు చేరుకున్నారు.
- రోడ్ షోలో 27 నిమిషాలు మాట్లాడారు.
- ఎన్నికల ప్రచార వాహనం పైనుంచి ప్రజలకు అభివాదం చేసిన కేటీఆర్.. ఇళ్లపై నిలబడి నినాదాలు చేస్తున్న వారికి 'జాగ్రత్త కింద పడుతారు' అంటూ సైగలు చేశారు.
- పలువురు నాయకులు, కార్యకర్తలు 'సీఎం .. సీఎం' అంటూ నినాదాలు చేశారు.
- కేటీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో చిరుమర్తి లింగయ్య నాయకత్వం వర్ధిల్లాలి అంటూ యువకులు నినాదాలు చేస్తుండగా.. నేను కూడా చిరుమర్తి లింగయ్య కోసమే వచ్చానని మంత్రి అన్నారు.
- కేటీఆర్ చిట్యాలలో రోడ్ షోలో వాహనం పైకి ఎక్కగానే వాహనం పైభాగంలో రెలియింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.
- యువకులు డీజే పాటలకు డాన్స్‌లు చేశారు. వారితో పాటు చిరుమర్తి లింగయ్య సైతం డాన్స్ చేశారు.
- రోడ్ షోలో పాల్గొన్న పలువురి పర్సులను దొంగలు చోరీ చేశారు.

– చిట్యాల

ప్రచారంలో బాలలు



ఆత్మకూరు(ఎం): మండలంలో మంగళవారం ఆలేరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గొంగిడి సునీత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయిపల్లిలో కొందరు చిన్నారులు బీఆర్‌ఎస్ జెండాలు పట్టుకొని ప్రచారంలో కనిపించారు.

సీఎం కాన్వాయ్‌ని తనిఖీ చేసిన ఎస్‌ఎస్‌టీ

తిరుమలగిరి (తుంగతుర్తి) : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రం పరిధిలోని ఈదులపర్రె తండా సమీపంలోని చెక్‌పోస్టు వద్ద సీఎం కాన్వాయ్‌ని మంగళవారం స్టాటిస్టిక్ సర్వేలైన్ టీమ్(ఎస్‌ఎస్‌టీ) క్షుణ్ణంగా తనిఖీ చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరిగిన సీఎం బహిరంగ సభకు హైదరాబాద్ నుంచి జనగామ, తిరుమలగిరి మీదుగా ఈ కాన్వాయ్ వెళ్తోంది. ఇందులో బస్సుతో పాటు రెండు ఫార్చ్యూనర్లు ఉన్నాయి. కేసీఆర్ మాత్రం ఈ కాన్వాయ్‌లో లేరు. సీఎం హెలికాప్టర్‌లో వెళ్లారు. ఈ తనిఖీలో టీమ్ లీడర్ జాన్ మహ్మద్, వీరన్న, రమేష్, తానీషా ఉన్నారు.



తిరుమలగిరిలో సీఎం కాన్వాయ్‌ని తనిఖీ చేస్తున్న అధికారులు

కారు గెలుపు కోసం బండిపై ప్రచారం

ఆత్మకూరు(ఎం) : ఆలేరు ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత మూడోసారి గెలుపొందాలని ఆత్మకూరు (ఎం) మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన కాటం యాదగిరి తన ద్విచక్ర వాహనాన్ని ప్రచార రథంగా తయారు చేసుకుని ప్రచారం నిర్వహిస్తున్నాడు.



అత్యధికం తుంగతుర్తి.. అత్యల్పం భువనగిరి

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఓటర్ల సంఖ్య మొత్తం 29,00,254 ఉండగా.. అత్యధిక ఓటర్లు తుంగతుర్తి నియోజకవర్గంలో, అత్యల్పంగా భువనగిరి నియోజకవర్గంలో ఉన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 2,55,017 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 1,27,578 మంది, స్త్రీలు 1.27,431 మంది, ఇతరులు 8 మంది ఉన్నారు. అత్యల్పంగా భువనగిరి నియోజకవర్గంలో ఉన్నారు. ఇక్కడ మొత్తం ఓటర్లు 2,16,941 మంది ఉండగా.. వీరిలో పురుషులు 1,.07,618 మంది, మహిళలు 1,09,322 మంది, ఇతరులు ఒక్కరు ఉన్నారు.



మహిళతో అసభ్యకర ప్రవర్తన

● నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా

అడ్డగూడూరు : మహిళతో అసభ్యకర్తంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ రామన్నపేట కోర్టు జడ్జి మంగళవారం తీర్పు వెలువరించారు. అడ్డగూడూరు మండలం బొడ్డుగూడెం గ్రామానికి చెందిన జగాటి సైదులు 2014వ సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించాడు. ఆమె ఒంటరిగా ఉండగా అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ సైదులుపై కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం నేరం నిరూపణ కావడంతో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారని అడ్డగూడూరు ఎస్‌ఐ నాగరాజు వివరించారు.

తప్పుచేయను.. ఎవరికీ తలవంచను

- ఆలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత

ఆత్మకూరు(ఎం): 'నేను తప్పు చేయను.. ఎవరికీ తలవంచను' అని ఆలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత అన్నారు. మంగళవారం ఆమె ఆత్మకూరు (ఎం) మండలం మొరిపిరాలలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతుండగా కొందరు గ్రామస్తులు ఆమె ప్రసంగానికి అడ్డు తగిలారు. దళితబంధు పథకం మంజూరుకు గ్రామ సర్పంచ్ తమ వద్ద డబ్బులు తీసుకున్నాడని ఆరోపించారు. దీనికి ప్రభుత్వ విప్ స్పందిస్తూ పైవిధంగా బదులిచ్చారు. దళితబంధు పథకానికి ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వవద్దని ఆనాడే చెప్పామని, ఇచ్చినందుకు మీది, తీసుకున్నందుకు అతనిది తప్పేనని అన్నారు. గొడవ చేస్తుంది..వీడియో తీస్తుంది ఎవరో తెలుసన్నారు. తర్వాత ఎమ్మెల్యే ప్రసంగానికి ప్రజలు అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ వాళ్లు సోషల్ మీడియాలో పెడతారని ఆమె అసహనం వ్యక్తం చేశారు. పోలీసులు ఈ సందర్భంగా గ్రామస్తులకు సర్దిచెప్పిన తర్వాత విప్ ప్రసంగించారు.



గ్రామస్తులకు సర్దిచెబుతున్న పోలీసులు

నియంతృత్వ పాలకులకు ఓటుతో బుద్ధిచెప్పాలి

- జాగో తెలంగాణ కన్వీనర్ మురళి

భువనగిరిటౌన్, ఆలేరు రూరల్, మోటకొండూరు: నియంతృత్వ పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని జాగో తెలంగాణ కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక, జాగో తెలంగాణ బస్సుయాత్ర మంగళవారం భువనగిరి, ఆలేరు, మోటకొండూరు మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. మోదీ విధానాలను తొమ్మిదేళ్లుగా కేసీఆర్ సమర్థిస్తూ వచ్చారని ఆరోపించారు. వీరికి మతతత్వ ఎంఐఎం పార్టీ మద్దతిస్తోందన్నారు. ఈ మూడు పార్టీలు పరస్పరం సహకరించుకుంటూ ఓట్లు, సీట్ల రాజకీయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కేసీఆర్ హామీ ఇచ్చిన కేజీ టు పీజీ అమలు కాలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పేదలకు పంచలేదని విమర్శించారు. అందరూ చదువుకోవడం అనే కాన్సెప్ట్‌కు బీజేపీ వ్యతిరేకమన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వలేదని విమర్శించారు. బడా పెట్టుబడిదారులకు రూ.16 లక్షల కోట్లు రుణమాఫీ చేశారని, అవే డబ్బులు విద్య, వైద్యానికి ఖర్చు చేస్తే అద్భుతమైన స్కూళ్లు, కాలేజీలు, హాస్పిటళ్లు నిర్మించేవాళ్లన్నారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి మాట్లాడుతూ గవర్న మెంట్ స్కీమ్‌లు కేవలం ఎమ్మెల్యేల అనుచరులు, పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రొఫెసర్ పద్మజా షా, ప్రొఫెసర్ రమ, నైనాల గోవర్ధన్, హన్మష్ ,దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ , దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, పీఎంసీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.శివలింగం, పులి కల్పన, రాష్ట్ర అధ్యక్షుడు మామిడికాయల పరశురాం, వైఎస్‌ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు అతహర్, శ్రీనివాసాచార్యులు, హమీద్ , జానీ జాగో తెలంగాణ సమన్వయకర్త నైనాల గోవర్ధన్, ప్రొఫెసర్ వినాయకరెడ్డి, పద్మజషా, హన్మేష్, జనార్దన్, స్వరూప, శంకర్, కల్పన, పుష్ప, సౌజన్య, సంధ్య, మామిడాల పరుశరాము, చిన్నయ్య, వినయ్‌కుమార్, నిర్మల, ఉప్పలయ్య, స్వామి పాల్గొన్నారు.



భువనగిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

బావమరిది మరణం తట్టుకోలేక బావ ఆత్మహత్య

కోదాడరూరల్ : బావమరిది మరణం తట్టుకోలేక బావ ఆత్మహత్య చేసుకున్నాడు. కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామానికి చెందిన కొత్తపల్లి నర్సింహారావు(68) బావమరిది దాచేపల్లి వెంకటేశ్వర్లు మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరూ చిన్ననాటి నుంచి స్నేహితులు కావడంతో నర్సింహారావు మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే నర్సింహారావు మంగళవారం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

మొన్న బీఆర్‌ఎస్‌లోకి.. నిన్న కాంగ్రెస్‌లోకి



ఎంపీ ఉత్తమ్ సమక్షంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్న గోలి చంద్రం

మఠంపల్లి: మండలంలోని బక్కమంతులగూడేనికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మఠంపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ గోలి చంద్రం సోమవారం ఎమ్మెల్యే సైదిరెడ్డి సమక్షంలో హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్‌లో చేరాడు. మంగళవారం తిరిగి నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాడు. ఆయనకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి తిరిగి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేసి బీఆర్‌ఎస్‌లోకి చేర్చుకున్నా తిరిగి వారు సొంతగూటికే వస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్, మాజీ సర్పంచ్ బోగాల పిచ్చిరెడ్డి, మాజీ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గంగసాని ఎల్లారెడ్డి, ముక్కంటి తదితరులున్నారు.

ఎన్‌జీఆర్‌ఐ ముఖ్య శాస్త్రవేత్తకు ప్రతిష్టాత్మక అవార్డు

- ఎస్‌జీఏటీ నుంచి సీతారాం రుంగ్టా స్మారక పురస్కారాన్ని అందుకున్న శ్రీనివాస్ శర్మ



శాస్త్రవేత్త శ్రీనివాస్ శర్మ

గరిడేపల్లి : హైదరాబాద్‌లోని జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్‌ఐ)ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ద్రోణ శ్రీనివాస్ శర్మకు భువనేశ్వర్‌లోని సొసైటీ ఆఫ్ జియోసైంటిస్ట్స్ అండ్ అలైడ్ టెక్నాలజీ (ఎస్‌జీఏటీ) నుంచి ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. 2023వ సంవత్సరానికి గాను ఆయన సీతారాం రుంగ్టా స్మారక అవార్డు అందుకున్నారు. ద్రోణ శ్రీనివాస్ శర్మది గరిడేపల్లి మండల పరిధిలోని సర్వారం గ్రామం. డాక్టర్ శర్మ 2003లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జియోకెమిస్ట్రీ, జెనిసిస్ ఆఫ్ గోల్డ్ మినరాలజీలో డాక్టరేట్ అందుకున్నారు. భారతీయ బంగారు నిక్షేపాలపై కాల పరిమితులను అందించిన మొదటి వ్యక్తి డాక్టర్ శర్మ. ఆయన కెనడాలోని అల్బెర్టా విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మక రామన్ రీసెర్చ్ ఫెలోషిప్ కింద పనిచేశారు. ఆయన తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ఫెలోగా కూడా ఉన్నారు. 2022లో ప్రతిష్టాత్మక జాతీయ భూ విజ్ఞాన పురస్కారాన్ని కూడా అందుకున్నారు.

యాదాద్రిలో వ్రత పూజలు ప్రారంభం

- తొలి రోజు వ్రతాలు ఆచరించిన 174 జంటలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ సన్నిధిలో శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తొలిరోజు మంగళవారం వ్రత మండపంలో 6 బ్యాచ్‌లుగా 174 జంటలు పాల్గొని వ్రతాలు ఆచరించారు. ఆలయానికి రూ.1,39,200 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

తిరునక్షత్ర వేడుకలు కూడా..

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మణవాళ మహాముని తిరునక్షత్ర వేడుకలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆగమశాస్త్రానుసారంగా ఆలయ ముఖ మండపంలో తొళక్కం నిర్వహించారు. వేద మంత్రాలతో పూజలు జరిపించారు. ఈ వేడుకల్లో ఆలయ ఆచార్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



యాదగిరీశుడి ఆలయంలో వ్రతాలను ఆచరిస్తున్న భక్తులు

రూ.2లక్షల విలువైన బొట్టుబిల్లలు స్వాధీనం

రామన్నపేట : ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తరలిస్తున్న రూ. 2లక్షల విలువైన బొట్టు బిల్లలను పోలీసులు పట్టుకున్నారు. రామన్నపేట శివారులో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో భువనగిరి వైపు నుంచి మిర్యాలగూడకు ఆటోలో తరలిస్తున్న బొట్టుబిల్లలతో కూడిన 10కాటన్ల కరపత్రాలను పోలీసులు గుర్తించారు. బొట్టుబిల్లలను స్వాధీనం చేసుకొని, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు. ఆ కాటన్లలో మిర్యాలగూడ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఫొటోతో కరపత్రాలు ముద్రించి ఉన్నట్లు సమాచారం.